# సత్యం, నిజాయితియే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పవిత్ర జీవిత ప్రకాశవంతమైన కోణాలు

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 08.05.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ. أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ.
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ
نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం జీవిత చరిత్ర గురించి వివరిస్తూ, ఆయన సత్యానికి సంబంధించిన కొన్ని ప్రమాణాలు, సంఘటనలను గతంలో వివరించాను. ఈ రోజు కూడా మరికొన్ని సంఘటనలను తెలియజేస్తాను. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంపై డాక్టర్ హెన్రీ మార్టిన్ క్లార్క్ ద్వారా హత్యాయత్నం అనే ఒక కేసు నమోదు చేయబడింది. ఇది అత్యంత ప్రమాదకరమైన కేసు. ఈ కేసు ఎంత తీవ్రమైనదంటే, ఇందులో ఉరిశిక్ష పడే అవకాశం కూడా ఉందని హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారే స్వయంగా పేర్కొన్నారు. యూదుల ద్వారా రోమన్ కోర్టులో హజ్రత్ ఈసా అలైహిస్సలాంపై నడపబడిన కేసును ప్రస్తావిస్తూ, ఆయన అలైహిస్సలాం ఇలా అన్నారు. ఇటువంటి కేసే నాపై కూడా జరిగింది. మసీహ్ అలైహిస్సలాంపై యూదులు కేసు వేయగా, ఈ ప్రభుత్వంలో నాపై కేసు వేసిన వ్యక్తి ఒక గౌ॥ పాదరీ మరియు డాక్టర్. అతను నాపై హత్యాయత్నం కేసును సృష్టించాడు, దానికి అవసరమైన సాక్ష్యాధారాలను పూర్తిగా సిద్ధం చేశాడు. చివరికి నాపై తీవ్ర వ్యతిరేకత, శత్రుత్వం కలిగిన మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ కూడా కోర్టులో సాక్ష్యం చెప్పడానికి వచ్చాడు. అతను నాపై సాక్ష్యం చెప్పడానికి తన శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు, ఆ కేసును నాపై పూర్తిగా రుజువు చేయడానికి శతవిధాలా కృషి చేశాడు.

ఈ కేసు గుర్దాస్‌పూర్ డిప్యూటీ కమిషనర్ కెప్టెన్ డగ్లస్ కోర్టులో నడిచింది. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. సాక్ష్యాలన్నీ నాకు వ్యతిరేకంగా ఎంతో బలంగా ఇవ్వబడ్డాయి. అటువంటి పరిస్థితిలో నేను ఈ కేసు నుండి నిర్దోషిగా విడుదలవుతానని ఏ న్యాయ నిపుణుడు కూడా ఊహించలేకపోయాడు.

కానీ అల్లాహ్ తఆలా ఈ కేసు ప్రారంభం కాకముందే నాకు సమాచారం అందించినట్లుగానే, నేను ఇందులో నిర్దోషిగా విడుదలవుతానని కూడా ముందే తెలియజేశాడు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన వాంగ్మూలంపై కెప్టెన్ డగ్లస్‌కు కొంత అనుమానం కలిగింది. అందుకే అతను అబ్దుల్ హమీద్‌ను పోలీస్ అధికారి కెప్టెన్ లెమార్చండ్‌కు అప్పగిస్తూ దీనిపై తిరిగి విచారణ జరపాలని ఆదేశించాడు. కెప్టెన్ అబ్దుల్ హమీద్‌ను పిలిపించి, నిజం చెప్పమని అడిగాడు. అబ్దుల్ హమీద్ మొదట తాను అంతకుముందు చెప్పిన కట్టుకథనే పునరావృతం చేశాడు. అయితే కెప్టెన్ గారు కఠినంగా మందలిస్తూ అసలు విషయం చెప్పమనేసరికి, అతను వాస్తవాన్ని బయటపెట్టాడు. తనను బెదిరించి ఆ విధంగా అబద్ధపు సాక్ష్యం చెప్పించారని స్పష్టంగా ఒప్పుకున్నాడు. మిర్జా గారు నన్ను చంపడానికి అస్సలు పంపలేదని తేల్చి చెప్పాడు. ఈ వాంగ్మూలం విన్న తర్వాత కెప్టెన్ సంతోషించి మేము కేసులోని అసలు నిజాన్ని కనుగొన్నామని డిప్యూటీ కమిషనర్‌కు టెలిగ్రామ్ పంపాడు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. వాస్తవం బయటపడినందుకు డిప్యూటీ కమిషనర్ ఎంతో సంతోషించాడు మరియు నాపై అబద్ధపు సాక్ష్యం చెప్పిన ఆ క్రైస్తవులపై ఆయనకు తీవ్రమైన కోపం వచ్చినట్లు ఆ సమయంలో కోర్టులో నేను గమనించాను. ఆ క్రైస్తవులపై మీరు తిరిగి కేసు వేయవచ్చని ఆయన నాతో అన్నాడు. కానీ నాకు కోర్టుల చుట్టూ తిరగడం ఇష్టం లేదు కాబట్టి నేను కేసు వేయదలుచుకోలేదని, నా కేసు పరలోకపు కోర్టులో (అల్లాహ్ వద్ద) దాఖలై ఉందని చెప్పాను.

హుజూరె అన్వర్ ఇలా వివరించారు. అదే కేసులో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం సచ్ఛీలత మరియు ఉన్నతమైన నైతికత గురించి అహ్మదియేతర న్యాయవాది మౌల్వీ ఫజల్ దీన్ గారు ఈ విధంగా పేర్కొన్నారు. నా హృదయంలో మిర్జా గారి పట్ల ఎంతో గౌరవం ఉంది. ఆయన గౌరవ మర్యాదలు చాలా గొప్పవని నేను భావిస్తాను. ఆయన చేసిన వాదనల గురించి ఒకవేళ మనస్తత్వశాస్త్రం దృష్ట్యా అర్థం చేసుకోవడంలో ఏదైనా పొరపాటు ఉండవచ్చునేమో గానీ ఆయన మాత్రం నిస్సందేహంగా ఒక పరమ పవిత్రమైన వ్యక్తి.

హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ రజియల్లాహు అన్హు గారు ఒక హిందూ సోదరుడైన లాలా దీనానాథ్ ద్వారా ఉటంకించిన ఇదే ఉదంతం ఇలా ఉంది. ఒక సభలో మౌల్వీ ఫజల్ దీన్ గారి సమక్షంలో ఒక వ్యక్తి, హజ్రత్ మిర్జా గారిని ఎంతో అసభ్యకరంగా మరియు కనీస నైతికత లేని రీతిలో వ్యతిరేకించసాగాడు. ఇది విన్న మౌల్వీ ఫజల్ దీన్ గారు ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. ఆయన ఎంతో ఆవేశంతో ఇలా అన్నారు. నేను మిర్జా గారి అనుచరుడిని కాను. ఆయన చేసిన ప్రకటనలపై నాకు విశ్వాసం లేదు. కానీ మిర్జా గారి అద్భుతమైన వ్యక్తిత్వానికి, ఆయన ఉన్నత నైతిక శిఖరాలకు నేనే సాక్షిని. నేను ఒక న్యాయవాదిని, నా దగ్గరకు అన్ని రకాల వర్గాలకు చెందిన వ్యక్తులు తమ కేసుల కోసం వస్తుంటారు. ఈ వృత్తిలో నేను వేలాది మందిని చూశాను. చట్టపరమైన సలహా ప్రకారం తన వాంగ్మూలాన్ని మార్చుకోవాల్సిన అవసరం వస్తే, ఏమాత్రం సంకోచించకుండా తమ మాట మార్చేసే వారినే నేను చూశాను. కానీ నా జీవితం మొత్తంలో కేవలం మిర్జా గారిని మాత్రమే చూశాను, ఆయన సత్యం అనే స్థానం నుండి ఒక్క అడుగు కూడా పక్కకు వేయలేదు.

మార్టిన్ క్లార్క్ కేసులో నేను ఆయన కోసం ఒక లీగల్ వాంగ్మూలాన్ని సిద్ధం చేసి ఆయనకు సమర్పించాను. ఆయన దానిని చదివి దీనిలో అబద్ధం ఉందని అన్నారు. దానికి నేను నిందితుడు ఇచ్చే వాంగ్మూలం ప్రమాణ పూర్వకమైనది కాదు, చట్టరీత్యా అతను తన రక్షణ కోసం ఏమైనా చెప్పుకునే అవకాశం ఉందని అన్నాను. అప్పుడు ఆయన ఇలా బదులిచ్చారు. చట్టం అయితే అతనికి ఆ అనుమతిని ఇచ్చింది, కానీ అల్లాహ్ తఆలా మాత్రం దానికి అనుమతించడు. కాబట్టి నేను కేవలం వాస్తవాన్నే తెలియజేస్తాను. తరువాత మేము ఆయనతో మీరు కేవలం అబ్దుల్ హమీద్ నాకు తెలియదని చెప్పండి, మిగతాది మేము చూసుకుంటామని అన్నాము. మా సూచనలన్నీ విన్న తర్వాత హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా అన్నారు. నేను ఈ ప్రపంచంలో సత్యాన్ని స్థాపించడానికి వచ్చాను. నాకు ఉరిశిక్ష పడినా సరే నేను ఏమాత్రం అబద్ధం చెప్పను. నాకు అబ్దుల్ హమీద్ తెలుసు. అతను ఖాదియాన్‌కు వస్తూ ఉండేవాడు. ఏం జరిగినా సరే నేను ఆ విషయాన్ని కాదనలేను. మేము మళ్ళీ ఆయనను వేడుకుంటూ మీరు అబద్ధం చెప్పకూడదనుకుంటే కనీసం స్పష్టంగా కాకుండా పొడిపొడిగా సమాధానం చెప్పండని అన్నాము. కానీ హుజూర్ గారు ఇలా స్పష్టం చేశారు. నేను అలా కూడా చేయలేను. దేవుడు నన్ను ఈ లోకంలో ఒక ఆదర్శంగా నిలబెట్టడానికి పంపాడు. ప్రాణాలను కాపాడుకోవడం కోసం అటువంటి ఆదర్శాన్ని దెబ్బతీయడానికి నేను సిద్ధంగా లేను. ఒకవేళ నిజం చెబుతూ మా ప్రాణం పోయినా మేము విజయం సాధించినట్లే భావిస్తాము.

న్యాయస్థానంలో హుజూర్ గారి వాంగ్మూలం నమోదు చేయబడినప్పుడు నాకు అబ్దుల్ హమీద్ తెలుసని ఆయన ఎంతో స్పష్టంగా తెలియజేశారు. ఆయన ఇచ్చిన ఆ వాంగ్మూలాన్ని చూసి ఇక ఆయన విడుదలవ్వడం అసాధ్యమని మేము నిశ్చయించుకున్నాము. కానీ ఆ కేసులో హుజూర్ గారికి లభించిన దైవ సహాయాన్ని చూసి

మేము ఆశ్చర్యపోయాం. దేవుడు తన అవతారునికి ఏ విధంగా సహాయం చేశాడో మరియు అంతటి తీవ్రమైన కేసు నుండి ఆయన ఎలా గౌరవప్రదంగా నిర్దోషిగా విడుదలై విజయం సాధించారో మేము కళ్ళారా చూశాం.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) ఇలా వ్రాశారు: 1916వ సం॥లో మిస్టర్ వాల్టర్ అహ్మదియ్యా జమాఅత్ గురించి పరిశోధన చేయడానికి ఖాదియాన్‌కు వచ్చారు. ఈ జమాఅత్ స్థాపకుని ఎవరైనా ఒక పురాతన అనుచరుడిని కలవాలని ఆయన తన కోరికను వ్యక్తం చేశారు. ఆ సమయంలో మున్షీ అరోడే ఖాన్ (రజి) గారు ఖాదియాన్‌లో ఉన్నారు. మిస్టర్ వాల్టర్‌ను మున్షీ గారితో కలిపించడం జరిగింది. మిస్టర్ వాల్టర్ మున్షీ గారితో సాధారణ సంభాషణ తర్వాత ఇలా అడిగారు. మిర్జా గారి సత్యానికి సంబంధించి ఏ నిదర్శనం మీపై అత్యధిక ప్రభావాన్ని చూపింది? దానికి మున్షీ గారు ఇలా బదులిచ్చారు. నేను పెద్దగా చదువుకున్న వాడిని కాను, నాకు లోతైన విద్యాపరమైన నిదర్శనాలు తెలియవు. కానీ నాపై అన్నింటికంటే ఎక్కువగా ప్రభావం చూపిన విషయం హజ్రత్ గారి వ్యక్తిత్వం. ఆయన కంటే ఎక్కువ సత్యవంతుడిని, నమ్మకస్తుడిని, దేవునిపై అంతటి అచంచల విశ్వాసం గల వ్యక్తిని నేను ఎక్కడా చూడలేదు. ఆయన్ను చూసిన ఎవరైనా సరే ఈ వ్యక్తి అబద్ధం చెబుతున్నారని అనలేరు. నిజానికి నేను ఆయన ముఖవర్చస్సును చూసి ముగ్ధుడినయ్యాను, నాకు అంతకంటే ఎక్కువ నిదర్శనాల గురించి తెలియదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది చెబుతూనే మున్షీ గారు హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) జ్ఞాపకార్థం ఎంతగానో వ్యాకులపడి, వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించారు. ఆయన ఏడుపు ఆపుకోలేక ఎగశ్వాస తీసుకునే స్థితికి చేరుకున్నారు. అది చూసి మిస్టర్ వాల్టర్ ముఖం పాలిపోయింది. ఆయన తన పుస్తకమైన అహ్మదియ్యా మూవ్‌మెంట్‌లో ఈ సంఘటనను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఇలా వ్రాశారు. తన సాంగత్యంలో ఇటువంటి వ్యక్తులను తయారు చేసిన వ్యక్తిని మనం కనీసం మోసగాడని మాత్రం చెప్పలేము.

మిర్జా రహీమ్ బక్ష్ గారు ఇలా వివరించారు. నేను ఒక అహ్మదీ వ్యక్తిని కలిశాను. మా మధ్య కొన్ని విషయాలు చర్చకు వచ్చాయి, దాంతో నేను ప్రభావితుడిని అయ్యాను. ఆ రాత్రి నాకు ఒక కల వచ్చింది. మేం నలుగురు సోదరులం ఒక పర్వత గుహలో దారి తప్పిపోయాం, మాకు బయటకు వెళ్ళే మార్గం కనిపించడం లేదు. అప్పుడు నేను ఒక వైపు నుండి పైకి పాకి వచ్చాను. అక్కడ ఒక రైలు వెళ్లడం చూశాను, కానీ ఆ రైలు భూమికి చాలా ఎత్తులో ఉంది. దానిపైకి ఎలా ఎక్కాలో తెలియక నేను ఆశ్చర్యపోయాను. అప్పుడు అక్కడ నిలబడి ఉన్న ఒక వ్యక్తి ఆకాశం నుండి కిందకు వేలాడుతున్న ఆ తాడును పట్టుకో అప్పుడు నువ్వు పైకి ఎక్కగలవు అని చెప్పాడు. మరుసటి రోజు ఉదయం ఇబ్రాహీం గారు నా దగ్గరకు వచ్చారు. నేను ఆయనకు నా కలను వివరించగా ఆయన పవిత్ర ఖుర్‌ఆన్ తీసి وَاعۡتَصِمُوۡا بِحَبۡلِ اللّٰهِ (అల్లాహ్ తాడును గట్టిగా పట్టుకోండి) అనే సూక్తిని చూపించారు. ఆ కలలోని తాడు అల్లాహ్ తాడును పట్టుకోవడమేనని ఆయన చెప్పారు. వెంటనే నేను బైఅత్ చేస్తూ లేఖ రాశాను. దానికి మీ బైఅత్ అంగీకరించబడింది, కానీ మీరు తప్పకుండా ఖాదియాన్ రావాలని సమాధానం వచ్చింది.

అమృత్‌సర్ స్టేషన్ నుండి బటాలా వెళ్లే రైలు ఎక్కినప్పుడు ఇద్దరు ముగ్గురు వృద్ధ సిక్కులు నా పక్కన కూర్చున్నారని ఆయన చెప్పారు. వారు నన్ను ఎక్కడికి వెళ్తున్నావు? అని అడిగారు. నేను ఖాదియాన్ అని చెప్పాను. వారు మిర్జా గారి ఖాదియాన్ కా? అని అడగగా నేను అవును అన్నాను. నేను వారిని హజ్రత్ గారి గురించి అడుగుతూ ఆయన ఎలాంటి వారు? అని అడిగాను. వారు తమ అవగాహన మేరకు ఆయన దైవత్వాన్ని ప్రకటిస్తున్నారని చాలా ప్రసిద్ధి అని చెప్పారు. నేను కేవలం సరదాగా ఇలా అన్నాను. నాకు మిర్జా తెలుసు సియాల్‌కోట్‌లో ఆయన, మా నాన్న ఇద్దరూ ఉద్యోగులు. వారిద్దరూ కలిసి భంగ్ (మత్తు పానీయం) తాగేవారు. నేను కేవలం తమాషాగా అన్నాను. అయితే ఆ మాట వినగానే ఆ సిక్కులు ఇలా అన్నారు. అయ్యో! అలా ఎప్పుడూ అనకండి. ఆయన ఒక సాధువు వంటి వారు, అత్యంత నిజాయితీపరుడు, నమ్మకస్థుడు. ఆయన ఎంతటి ప్రసిద్ధులంటే ప్రజలు ఆయన్ని ఒక ఉదాహరణగా చూపిస్తారు. మా ప్రాంతంలో ఎవరైనా నిజం మాట్లాడితే నువ్వేమైనా మిర్జా గులాం ముర్తజా

కొడుకువా? అని అడుగుతారు. ఆయన పేరు సత్యానికి ఒక మారుపేరుగా మారిపోయింది. వారిలో ఒకరు ఇలా అన్నారు. ఆయన చిన్నప్పుడు మా అందరితో ఆడుకునేవారు. ఒక భూస్వామి కొడుకు కాబట్టి మేము ఆయన్ని గౌరవించేవాళ్లం. ఆ తర్వాత ఆయనలో మార్పు వచ్చింది, ఆయన ఒంటరిగా గడపడం మొదలుపెట్టారు. అంటే లోపలే ఉండి ఏదో మంత్రతంత్రాలు నేర్చుకుంటున్నారని (అది వారి నమ్మకం) లోపల కూర్చునే ఖాదియాన్ చుట్టూ నాలుగు మైళ్ల వరకు తన మాయాజాలాన్ని విస్తరించారని వారు భావించారు. ఏ మతానికి చెందిన వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చినా, వారి మత గ్రంథాల నుండే తన సత్యత్వాన్ని నిరూపించి చూపిస్తారని, తాను ఆకాశం నుండి వచ్చానని చెబుతారని ఆ సిక్కులు అన్నారు. నేను వారి నుండి ఈ విషయాలన్నీ విన్నాను. నేను ఖాదియాన్‌లోని అతిథి గృహానికి చేరుకున్నప్పుడు అక్కడ ముగ్గురు నలుగురు యువకులు ఉన్నారు. వారిని పరీక్షించడానికి నేను కాస్త కఠినంగా మాట్లాడాను, కానీ నా కఠినత్వానికి బదులుగా వారు ఎంతో మృదువుగా, సంస్కారంతో ప్రవర్తించారు. ఆ సమయంలో ఖాదియాన్‌లో ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయి. నేను తిరిగి వెళ్ళిపోవాలని అనుకున్నప్పుడు ఒక అరబ్ వ్యక్తి నాకు ఎదురయ్యారు. ఆయన నాతో ఇంత దూరం వచ్చిన తర్వాత హజ్రత్ గారిని చూడకుండా తిరిగి వెళ్లకండి ఈ సమయం మళ్ళీ తిరిగి రాదని చెప్పారు. అంతలోనే అజాన్ వినిపించింది, సరే నమాజ్ చదివి వెళ్దామని నేను అనుకున్నాను. నమాజ్ పూర్తయిన తర్వాత హజ్రత్ అలైహిస్సలాం సభలో కూర్చున్నారు. ఆయన తన తల దించుకుని ఉన్నారు. నేను ఆయనకు ఎదురుగా నిలబడి ఉన్నాను, అప్పుడు నాకు గడ్డం కానీ మీసాలు కానీ లేవు. ఈ వ్యక్తి ముఖాన్ని చూసే వరకు నేను నమ్మనని నా మనసులో అనుకున్నాను. కాసేపటి తర్వాత హజ్రత్ గారు అలైహిస్సలాం తల పైకెత్తి చూశారు. ఆయన సత్యవంతుడని నా మనసు సాక్ష్యమిచ్చింది. మళ్ళీ కాసేపటి తర్వాత ఆయన తల పైకెత్తి చూడగా 'ఆమన్నా' (మేము విశ్వసించాము) అని నేను మనసులోనే అనుకున్నాను. మూడవసారి ఆయన నా వైపు చూడగానే నేను పూర్తిగా ఆయనకు అంకితమైపోయాను.

హజ్రత్ చౌదరి సర్ జఫ్రుల్లాహ్ ఖాన్ (రజి) ఇలా వివరించారు. నేను లాహోర్‌లో మొదటిసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంను దర్శించుకున్నప్పుడు ఆ క్షణంలో నా మనసుపై కలిగిన ప్రభావం ఏమిటంటే ఈ వ్యక్తి సత్యవంతుడు మరియు ఆయన చెప్పేది నిజం. అల్లాహ్ తఆలా నా హృదయంలో ఆయన పట్ల ఎంతటి ప్రేమను నింపాడంటే అదే నాకు హజ్రత్ అలైహిస్సలాం సత్యానికి అసలైన నిదర్శనంగా మారింది. నేను అప్పట్లో చిన్న పిల్లవాడిని అయినప్పటికి ఆ సమయం నుండి ఇప్పటి వరకు నాకు (ఆయన సత్యాన్ని నమ్మడానికి) మరే ఇతర ఆధారం అవసరం రాలేదు. ఆ తర్వాత నా విశ్వాసాన్ని మరింత బలపరిచే ఎన్నో సంఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఎందుకంటే నేను హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పవిత్ర ముఖాన్ని చూడగానే ఆయన్ని నమ్మాను. ఆనాడు నాపై కలిగిన ఆ ప్రభావమే నేటికీ హజ్రత్ అలైహిస్సలాం వాదనలోని సత్యానికి నా వద్ద ఉన్న అతిపెద్ద సాక్ష్యం.

అల్లాహ్ తఆలా మనకు ఈ యదార్థాన్ని గ్రహించే సామర్థ్యం ప్రసాదించుగాక! తద్వారా మనం సత్యంపై స్థిరంగా నిలిచేవారిగా, ఎల్లప్పుడూ సత్యపు ఉన్నత ప్రమాణాలను పాటించేవారిగా ఉందుముగాక!

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -